ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 5

ఆదివారం 28 జూలై 2024



ఆదివారం ప్రత్యేకం Sundayspecial



అమ్మానాన్నలు అనాథలుగా మారుతున్నారు. అవసాన దశలో అండగా ఉండాల్సిన బిడ్డలు వృద్ధాశ్రమాల్లో చేర్పించి చేతులు దులుపుకుంటున్నారు. ఎన్నో కష్టాలకోర్చి బిడ్డల కోసం తమ ఆర్జితాన్ని ధారపోస్తే చివరికి వారు దిక్కులేని జీవితాన్ని అనుభవిస్తున్నారు. కనిపెంచడంతోపాటు బిడ్డల భవిష్యత్ కోసం అహర్నిశలు శ్రమించే నిత్య కార్మికులైన తల్లిదండ్రులు నిరాదరణకు గురవుతున్న ఈ పరిస్థితుల్లో అమ్మానాన్నల దినోత్సవం జరుపుకోవడం అవసరమా అంటే కచ్చితంగా అవసరమే అని చెప్పాలి. తల్లిదండ్రుల పట్ల ప్రేమ, ఆప్యాయతలు తగ్గిపోతున్న ఈ రోజుల్లో వారిని అర్థం చేసుకొని, గౌరవించి, వృద్ధాప్యంలో ఆసరాగా ఉండాలి. దీని కోసం తల్లిదండ్రుల పాత్రను వివరిస్తూ జూలై 4వ ఆదివారం తల్లిదండ్రుల దినోత్సవం జరుపుకుంటున్నారు. 1994లో ఆనాటి అమెరికా అధ్యక్షులు బిల్‌క్లింటన్ ఫాదర్స్ డే, మదర్స్‌డేలను రద్దు చేసి తల్లిదండ్రుల విషయంలో లింగభేదం ఉండరాదన్న ఉద్దేశంతో తల్లిదండ్రుల దినోత్సవాన్ని నిర్వహించాలని తీర్మానించగా ఆ దేశ సుప్రీంకోర్టు ఇందుకు అంగీకరించింది. అప్పటి నుంచి ప్రపంచదేశాల్లో తల్లిదండ్రుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మనదేశంలో కూడా జూలై 4వ ఆదివారం తల్లిదండ్రుల దినోత్సవం జరుపుకుంటున్నారు.

-ఆత్మకూరు

కనిపించే ప్రత్యక్ష దైవం తల్లిదండ్రులే



జీవితాన్ని ప్రసాదించిన తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవమన్న విషయాన్ని పిల్లలు గుర్తించాలి. పిల్లలు ఉన్నత స్థితికి చేరుకోవడానికి తల్లిదండ్రులు పడే తపన అంతా ఇంతా కాదు. అయితే నేటి సమాజంలో పిల్లలు తల్లిదండ్రులు యోగ క్షేమాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం బాధాకరం. భవిష్యత్‌లో మేము వృద్ధులమవుతామన్న విషయాన్ని పిల్లలు గుర్తించుకోవాలి. మరణించిన తర్వాత తల్లిదండ్రులకు పిండ ప్రదానాలు, తర్పణాలు చేయడం కన్నా వృద్ధాప్యంలో వారిని బాగా చూసుకోగలిగితే అనంతకోటి పుణ్యఫలం లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

-గరుడాద్రి సత్యనారాయణశర్మ, పురోహితుడు, ఆత్మకూరు

అమృత మూర్తులు అమ్మానాన్నలు

- తల్లిదండ్రులపై తగ్గుతున్న ప్రేమానురాగాలు
- వృద్ధాశ్రమాల్లో చేర్పిస్తున్న పిల్లలు
- జీవిత చరమాంకంలో దిక్కులేని జీవితం
- అండగా నిలిచిన దేశ అత్యున్నత న్యాయస్థానం
- నేడు తల్లిదండ్రుల దినోత్సవం

జీవిత చరమాంకంలో అండగా ఉండాలి

వృత్తి, సామాజిక, ఆర్థికపరంగా అనే ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నప్పటికీ జీవిత చరమాంకంలో తల్లిదండ్రుల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలి. వృద్ధాప్యంలో ఒక తోడు కోసం.. ఓ తియ్యని పలుకు కోసం అల్లాడిపోయ్యే తల్లిదండ్రులకు ఆప్యాయతను పంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భార్య చెప్పిందనో.. ఆమె బాధపడుతుందనో, కుటుంబ స్థితిగతులు బాగలేవనో ఇలా అనేక కారణాలతో తల్లిదండ్రులను దూరం చేసుకుంటే భవిష్యత్‌లో తమ పిల్లలు కూడా తమను అలాగే చూస్తారన్న విషయాన్ని గుర్తించుకోవాలి. దయనీయ స్థితిలో ఉన్న తల్లిదండ్రుల పట్ల ప్రేమతో మెలిగినప్పుడే వారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుంది.

వృద్ధులకు అండగా దేశ అత్యున్నత న్యాయస్థానం

భారతదేశ సమాజంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో చిన్న కుటుంబాలు ఎక్కువైపోయి తాను, తన భార్యా బిడ్డలు అనే స్వార్థ సంస్కృతి రోజురోజుకూ మితిమీరిపోతోంది. ఫలితంగా ఆర్థిక, సామాజిక, భౌతిక, ఉద్వేగభరితమైన సమస్యలు వస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఇటువంటి పరిస్థితి అధికమవడంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. సంపాదన లేని తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణ, పోషణ కోసం చొరవ తీసుకుంది. ఇందుకుగానూ 2007లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్-2007 పేరుతో ఓ చట్టాన్ని ప్రవేశపెట్టింది. (ఐపీసీ సెక్షన్ 125(1)) పేరిట పార్లమెంట్‌లో 29.12.2007లో ఆమోదం పొంది అదే నెల 31న భారత రాష్ట్రపతి బిల్లును పాస్ చేశారు. ఈ చట్టం ప్రకారం 60 ఏళ్ల వయస్సు పైబడిన ప్రతి ఒక్కరి సంరక్షణ, పోషణ చూడాల్సిన బాధ్యత వాళ్ల పిల్లలు లేదా చట్టప్రకారం నిర్ధారణ పొందిన బంధువులపై ఉంది. అయితే ఈ చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ.. పిల్లలు అనే నిర్వచనానికి పరిధి విస్తృత పరిచారు. దీని ప్రకారం పిల్లలు అనే అర్థంలో అల్లుళ్లు, కోడళ్లు, మనవళ్లు, దత్తత తీసుకున్న లేదా సవతి తల్లి పిల్లలు, చట్టబద్ధమైన సంరక్షకుల వద్ద ఉన్న మైనర్లు కూడా వస్తారు. (గతంలో పిల్లలు అంటే కొడుకు, కూతురు, మనవళ్లు, మనవరాండ్లు వస్తారు. ఇందులో మైనర్లకు పోషణకు మినహాయింపు ఇచ్చారు)

తల్లిదండ్రులు కూడా పిల్లలకు మార్గదర్శకులు కావాలి

సమాజంలో తల్లిదండ్రులది ఉన్నతమైన పాత్ర. అయితే తల్లిదండ్రులు తమ పిల్లలకు నేర్పించాల్సిన కనీస విషయాలను తెలియపర్చాల్సిన అవసరం ఉంది. సమాజంలో తల్లిదండ్రులు, గురువులను ఎలా గౌరవించాలో పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలి. ఇంట్లో ఎవరైనా వృద్ధులు ఉంటే వారి పట్ల చూపించాల్సిన ప్రేమానురాగాలను పిల్లలు గ్రహించేలా సేవలు అందించాలి. కాగా నేటి రోజుల్లో తల్లితండ్రులు బీజీబీజీ కార్యకలాపాల వల్ల పిల్లల్ని హాస్టళ్లలో వదిలేసి తల్లిదండ్రుల ఆప్యాయతకు దూరం చేయడం వల్ల భవిష్యత్‌లో తల్లిదండ్రుల పట్ల చాలా మంది పిల్లలికి ప్రేమానురాగాలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. అంతేగాకుండా ఐదారేళ్ల చిన్నారులను సైతం కిండర్ హాస్టళ్లలో వదిలి బాధ్యతలను తప్పించుకుంటున్న తల్లిదండ్రులు కూడా పిల్లలకి కనీస అవగాహన వచ్చే వరకు వారి సంరక్షణలో ఉంచుకోవడం ఉత్తమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



నిర్ణీత పోషణ ఖర్చుల ఎత్తివేత

ఒకప్పుడు వృద్ధుల సంరక్షణకు సంబంధించి గరిష్టంగా పోషణ, సంరక్షణకు నెలకు రూ.10వేలు ఉండేది. అయితే ప్రస్తుత చట్టాల ప్రకారం ఈ నిర్ణీత పోషణ ఖర్చులను ఎత్తివేశారు. పెద్దలు, పిల్లల ఆదాయాన్ని బట్టి ఇవ్వాల్సిన మొత్తాన్ని లెక్కిస్తారు. ప్రత్యేకించి ఆహారం సమకూర్చడం, దుస్తులు, ఉండటానికి అనువైన నివాసం, వైద్య సహకారం అందించాల్సి ఉంది. అయితే ఈ చట్టం ప్రకారం ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తల్లిదండ్రులు, వృద్ధులైన బంధువుల సంరక్షణ, పోషణ చూడకుండా నిర్లక్ష్యంగా వదిలేసినా, దూషించినా ఆరు నెలల గరిష్ఠ జైలు శిక్ష ఉంటుంది. గతంలో ఇది మూడు నెలల మాత్రమే ఉండేది. పలు సందర్భాల్లో జైలు శిక్ష, జరిమానా కూడా విధించవచ్చు.

ఈ చట్టం పరిధిలోకి ఎవరెవరు వస్తారంటే ..

1. తమ జీవనోపాధి కోసం తాము స్వతహాగా సంపాదించుకోలేని, ఇతర సంపాదన మార్గాలు లేని తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ చూడాల్సిన బాధ్యత వాళ్ల పిల్లలదే.
2. ఒకవేళ కొడుకులు లేకుంటే ఆ తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ చూడాల్సిన బాధ్యత కూతుళ్ల(అల్లుళ్ల) మీద కూడా ఉంది.
3. పిల్లలు లేక ఎవరైనా దత్తతకు తీసుకుంటే ముసలితనంలో ఆ దంపతుల సంరక్షణ బాధ్యత ఆ పిల్లలదే.
4. వీళ్లే కాకుండా సవతి తల్లికి వృద్ధాప్యంలో ఆలనా, పాలనా చూసే దిక్కు. లేకుండా ఆవిడ సంరక్షణ చూడాల్సిన బాధ్యత కూడా పిల్లలపైన ఉంటుంది.

కాగా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం రూపొందించిన తర్వాత 2011లో తొలిసారిగా తమిళనాడు రాష్ట్రంలో తమ పిల్లలు సంరక్షణ విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారంటూ శిలువాయ్(84), ఆరుమ్మాల్(80) దంపతులు కోర్టును ఆశ్రయించారు. తమ వద్ద ఉన్న రెండు ఇళ్లు, బంగారు నగలు తీసుకుని కొడుకు, కూతుళ్ల తమను పట్టించుకోవడం లేదని ఆ వృద్ధ దంపతులు కోర్టును ఆశ్రయించారు. ఇదిలావుంటే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చట్టం వృద్ధాప్యంలో ఉన్న వారికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తున్నప్పటికీ అమలులో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ చట్టాన్ని అమలు చేయడం రాష్ట్ర ప్రభుత్వాలకు అంత సులభంగా లేదు. వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు వాటి నిర్వహణ కష్టతరమైనది. ఈ చట్టాన్ని అమలు చేయడం ఎన్నో సవాళ్లతో కూడుకుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



తల్లిదండ్రులను సంరక్షించాల్సిన బాధ్యత పిల్లలదే



జన్మనిచ్చి, పెంచి పోషించి, ప్రయోజకుల్ని చేసిన తల్లిదండ్రులను చరమాంకంలో కంటికి రెప్పలా సంరక్షించాల్సిన బాధ్యత పిల్లలపైనే ఉంది. ఇది అందరి నైతిక బాధ్యత కూడా. అయితే ఇటీవల తల్లిదండ్రులను పట్టించుకోని సంఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే వృద్ధుల సంరక్షణను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకు వచ్చింది. కానీ చట్టాలతో వృద్ధుల సంరక్షణ, పోషణ చూడాల్సిన పరిస్థితికి రావడం దురదృష్టకరం. ఈ విషయంలో సమాజం కూడా ఆలోచించాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసి, చట్టం ముందుగా దోషులుగా నిలబడే వరకు తెచ్చుకోకూడదు. తల్లిదండ్రులను గౌరవించే విధానాలు చిన్నతనం నుంచే పిల్లలు అలవర్చుకోవాలి. కాగా తల్లిదండ్రులను పట్టించుకోకపోవడంతో ఇటీవల వెలుగోడులో ఓ ఫిర్యాదు రావడంతో వారి పిల్లలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

- నాగభూషణ్, ఆత్మకూరు రూరల్ సీఐ



మహానందిని వదలని చిరుత

మరోసారి గోశాల పరిసరాల్లో సంచారం



మహానంది గోశాల పరిసరాల్లో సంచరిస్తున్న చిరుతపులి

మహానంది, జూలై 27: మహానంది పరిసరాల్లోని దేవస్థానం గోశాల వద్ద మరోసారి చిరుతపులి సంచరించింది. క్షేత్రానికి అత్యంత సమీపంలో నల్లమల అటవీ ప్రాంతం ఉండటంతోపాటు పక్కనే ఉన్న గోశాలలోని గోవులపై దాడి చేసేందుకు శుక్రవారం రాత్రి చిరుతపులి సంచరించినట్లు అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీల్లో కనిపించింది. మూడు సార్లు గోశాల పరిసరాల్లో చిరుత సంచరించింది. అదే చిరుతపులినా లేక మరొకటి వచ్చిందా అనేది అటవీశాఖ అధికారులు సంచరించిన ప్రదేశంలో పాదముద్రలు పరిశీలించి తేల్చాల్సి ఉంది. చిరుత సంచారంతో మహానంది పరిసరాల్లో నివసించే ప్రజలతోపాటు భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు మాత్రం చిరుత సంచారం వల్ల ప్రజలకు ఎలాంటి హానీ జరగడం లేదని, దీంతో బోను ఏర్పాటు చేసి బంధించేందుకు తమకు అనుమతులు లేవని చెబుతున్నారు. ఉన్నత స్థాయి అధికారుల నుంచి అనుమతి వస్తేనే బోను ఏర్పాటు చేసి బంధించే అవకాశం ఉంటుందని తెలియపరుస్తున్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించండి

నంద్యాల (నూనెపల్లె), జూలై 27: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఆసక్తి గల రంగాలలో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. ప్రధానంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో ఉన్న నిరుద్యోగ యువతకు వ్యవసాయ సంబంధిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి కల్పించే దిశగా కోర్సులను గుర్తించాలన్నారు. జిల్లాలోని పెద్ద పరిశ్రమలను సంప్రదించి వారి అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగులకు శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రవీంద్రారెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస యాదవ్, జిల్లా ఇన్‌చార్జి డీఆర్డీ ఏపీడీ కళ్యాణి, ఉపాధి కల్పనా అధికారి దీప్తి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

పోతిరెడ్డిపాడు నుంచి నీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, కలెక్టర్ రాజకుమారి

జూపాడుబంగ్లా, జూలై 27: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి శనివారం దిగువ ఎస్సారెమ్సీ కాల్వలోకి పది వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి, కలెక్టర్ రాజకుమారి బటన్ నొక్కి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని అన్నారు. పోతిరెడ్డిపాడు రాయలసీమకు తలమానికంగా ఉందని, తద్వారా దిగువ ఉన్న జలాశయాలను నింపి తాగు, సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు నుంచి దిగువ బానకచర్ల, తెలుగుగంగ, కేసీ ఎస్కేప్, ఎస్సార్బీసీ, గాలేరు నగరి కాల్వలకు నీరు నింపి తాగు, సాగునీరు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో నీటి పారుదలశాఖ ఎస్ఈ వెంకటరమణయ్య, ఈఈ పార్థసారథి, ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ నాయకులు గిరీశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ నుంచి పది వేల క్యూసెక్కుల నీటిని ఇరిగేషన్ అధికారులు ఎస్ఈ వెంకటరామయ్య, ఈఈ పార్థసారథి విడుదల చేశారు. శనివారం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎమ్మెల్యే జయసూర్య, కలెక్టర్ రాజకుమారి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి పది వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆ నీటిని వెయ్యి క్యూసెక్కులు ఎస్కేప్ చానల్‌కు తొమ్మిది వేల క్యూసెక్కుల నీటిని వీబీఆర్‌కు విడుదల చేశారు. కార్యక్రమంలో డీఈఈలు నాగేంద్ర కుమార్, ఉదయ్ కుమార్‌రెడ్డి, ఏఈఈ దేవేంద్ర, విశ్వనాథ్ ఏఈ మధుసూదన్‌రావులు పాల్గొన్నారు.



పోతిరెడ్డిపాడు గేట్ల నుంచి ఎస్సారెమ్సీ కాల్వలో పరవళ్లు తొక్కుతున్న జలాలు

హెపటైటిస్ ముప్పు

- సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్యం
- ముందస్తు వ్యాక్సినేషన్‌తో చెక్
- నేడు వరల్డ్ హెపటైటిస్ డే




కర్నూలు(హస్పటల్), జూలై 27: శరీరంలోని అత్యంత కీలకమైన అవయవాల్లో కాలేయం ఒకటి. జీర్ణక్రియ సాఫీగా సాగాలన్నా, వ్యాధి నిరోధక వ్యవస్థ సక్రమంగా ఉండాలన్నా కాలేయమే ప్రధానం. అయితే గత కొన్నాళ్ళుగా కాలేయ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. అందులోనూ ఎక్కువ మంది హెపటైటీస్ బాధితులు ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. కర్నూలు ప్రభుత్వం సర్వజన వైద్యశాల విభాగానికి ప్రతి నెల 200 మంది హెపటైటీస్ బి బాధితులు గుర్తిస్తున్నారు. హెపటైటీస్ వల్ల కాలేయం పాడవకుండా ఉండాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ నెల 28న ప్రపంచ హెపటైటీస్ డే సందర్భంగా వరల్డ్ హైపటైటీస్ సొసైటీ ఈ ఏడాది ఇది చర్య కోసం సమయం, ప్రపంచస్థాయి హెపటైటీస్‌ను పరిష్కరించడానికి వేగవంతమైన, నిర్ణయాత్మక చర్యల తక్షణ అవసరాన్ని కేంద్రం చేసుకొని పిలుపు ఇచ్చింది. ప్రతి 30 సెకన్లకు ఒకరు హెపటైటీస్‌తో మరణిస్తున్నట్లు సమాచారం.

హెపటైటీస్ ఏబీసీడీఈ అనే వ్యాధుల వైరస్ గురించి ప్రతి ఏటా జూలై 28న ప్రపంచ హెపటైటీస్ నివారణ దినాన్ని జరుపుకుంటారు. ఓపెన్ యాప్ గ్రహీత అయిన డాక్టర్ బరూచ్ బ్లూమ్‌బెర్గ్ పుట్టిన రోజును పురస్కరించుకొని దీన్ని నిర్వహిస్తున్నారు. 1960లో హైపటైటీస్ బి వైరస్ (హెచ్‌బీవీ)ని ఈయన కనుగొన్నారు. ద్వాఆ 2008 నుంచి ప్రతి ఏడాది జూలై 28న వరల్డ్ హెపటైటీస్ డే నిర్వహిస్తున్నారు.

ఐదు రకాల వైరస్..

హెపటైటీస్ ఏ.బీ.సీ.డీ.ఈ. అనే ఐదు రకాల వైరస్‌ల వల్ల కాలేయ సమస్యలు వస్తున్నాయి. హెపటైటీస్ అంటే లివర్‌కు కలిగే వైర్ ఇన్‌ఫెక్షన్ వీటిలో ఏడీఏ రకాలు ప్రమాదకరమైనవి కావు. ఇవి కలుషిత ఆహారం, నీటిని తీసుకోవడం వల్ల వస్తాయి. కొద్దిరోజుల పాటు పచ్చకామెర్లు వచ్చి తగ్గిపోతాయి. కాని బీ.సీ. వైరస్ మాత్రం ప్రమాదకమైనదిగా వైద్యులు చెబుతున్నారు. నిర్లక్ష్యం వహిస్తే లివర్ సిరోసిస్ (క్యాన్సర్) దశకు చేరి ప్రాణహాని కలుగుతుంది.

ఈ రెండింటితో సమస్య..



హెపటైటీస్ బి కలుషిత రక్తం, సిరంజులు, సూదులు వినియోగించడం, అసురక్షితమైన లైంగింగక సంపర్కం మొదలైనవాటి వల్ల వస్తుంది. ఇది తల్లి నుండి బిడ్డలకు సంక్రమిస్తుంది. ఈ వ్యాధి బారిన పడిన వారిలో 80 వాతం మందికి అసలు విషయం తెలియదు. హెపటైటీస్ బి బాధితుల్లో 20 శాతం మంది లివర్ సిర్రోసిస్ (కాలేయం పూర్తిగా దెబ్బతిని పనిచేయదు) బారినపతారు. దీనిని క్రానిక్‌లివర్ డీసీజ్ అంటారు. భారతదేశంలో హెపటైటీస్ బాధితులకు జనాభాలో 4-5 శాతం మంది ఉన్నారు. పచ్చ కామెర్లతో కూడిన జ్వరం ఎక్కువ రోజుల పాటు వేధిస్తుంది. హెపటైటీస్ బీవీ స్కేనింగ్ టెస్టు ద్వారా గుర్తించవచ్చు.

526 హెపటైటిస్-సీ కేసులు గుర్తించాం



2023 ఏప్రిల్ నుంచి 2024 జూలై 15వ తేదీ వరకు ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించగా.. 526 మందికి హెటైటిస్-సీ ఉన్నట్లు గుర్తించి చికిత్స అందించాం. ప్యాపిలి మండలంలో ఈ కేసులు అధికంగా వెలుగు చూస్తున్నాయి. ఇక పక్కనున్న గద్వాల జిల్లాలోని అయిజ, వడ్డెపల్లి, రాజోలి మండలాల్లో కూడా అధికంగా కేసులు వస్తున్నాయి. హెపటైటిస్ బీ, సీ వైరస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇప్పటి వరకు పది వేల మందికి వ్యాక్సినేషన్ వేశాం.

- డా.జి.మోహన్‌రెడ్డి, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగం

హెపటైటిస్ లివర్‌కు వచ్చే సమస్య



హెపటైటీస్ వైరస్ లివర్‌కు వచ్చే సమస్య. చాలా మంది వ్యాధి ముదిరిన తరువాత వైద్యం కోసం వస్తున్నారు. ఈ వైరస్‌లు రాకుండా ఉండాలంటే వ్యక్తి శుభ్రం పాటించడం, కలుషిత నీటికి, ఆహారానికి దూరంగా ఉండాలి.

-డా.పి. అబ్దుల్ సమద్
గ్యాస్ట్రోఎంటారాలజిస్టు, కర్నూలు మెడికల్ హాస్పిటల్

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు



రద్దీగా ఉన్న భక్తులు

మంత్రాలయం, జూలై 27: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది. శని, ఆదివారం నెల ఆఖరి దినాలు కావటంతో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు రథోత్సవాలలో పాల్గొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులు పొందారు.

మద్యం రవాణా కేసులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు

జిల్లా ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్

ఆదోని, జూలై 27: జిల్లాలో అక్రమ మద్యం రవాణా కేసుల పురోగతిపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ తనిఖీ చేసి అనంతరం సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడారు. విధి నిర్వహణలో సిబ్బంది సమస్యలపై ఆరా తీశారు. శాఖ ప్రతిష్టను పెంచేలా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. స్టేషన్లో రికార్డులపని పెండింగ్ లేకుండా సక్రమంగా నిర్వహించాలని అన్నారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాలలో విధిగా పర్యటించాలని సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు విన్నిలత, భార్గవరెడ్డి, స్వర్ణలత పాల్గొన్నారు.

సుంకేశ్వరి పంచాయతీ సెక్రటరీ సస్పెన్షన్

విధుల్లో నిర్లక్ష్యమే కారణం

మంత్రాలయం, జూలై 27: మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామ పంచాయతీ సెక్రటరీ చిరంజీవిపై సస్పెన్షన్ వేటు పడింది. శనివారం కలెక్టర్ రంజిత్ బాషా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 16వ తేదీన సుంకేశ్వరిలో అతిసారా సోకి మూడేళ్ల చిన్నారి జ్యోతి మృతి చెందిన విషయం తెలిసిందే. గ్రామంలో దాదాపు 70 మందికి పైగా అస్వస్థతకు గురై వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండటంతో అప్పటి జేసీ, ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, డీపీవో, డీఎంహెచ్‌వో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వంటి ఉన్నతాధికారులు గ్రామాన్ని సందర్శించి తాగునీరు, పారిశుధ్యం వంటి అంశాలపై తీవ్రంగా మండిపడ్డారు. దీనికంతటికీ కారణం గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శి చిరంజీవి విధి నిర్వహణలో నిర్లక్ష్యమని నాటి జేసీ నివేదిక ఇచ్చారు. ఈ మేరకు ఆయనను శనివారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మల్లన్న సన్నిధిలో కార్మిక శాఖ మంత్రి



ఆలయ ప్రాంగణంలో మంత్రి వాసమ్‌శెట్టి సురేష్

శ్రీశైలం, జూలై 27: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం అంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసమ్‌సెట్టి సురేష్ దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు వచ్చిన మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామివారికి అభిషేకం, భ్రమరాంబదేవి అమ్మవార్లకి కుంకుమార్చన జరిపించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో మంత్రికి వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. తరువాత ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

ఇద్దరు కార్పొరేటర్ల నామినేషన్ ఉపసంహరణ

కర్నూలు(న్యూసిటీ), జూలై 27: నగరపాలక సంస్థ స్థాయి సంఘ కమిటీ సభ్యుల ఎన్నికలకు ఇద్దరు కార్పొరేటర్లు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. శనివారం నగర పాలక కార్యాలయంలో 50వ వార్డు ఎస్‌టీ. షేక్ అహ్మద్, 1వ వార్డు కార్పొరేటర్ పి.షాషావలి.. కార్యదర్శి నాగరాజు, మేనేజర్ చిన్న రాముడుకు ఉపసంహరణ పత్రాలు అందజేశారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలతో ఉపసంహరణ ప్రక్రియ ముగియనుంది. తరువాత అభ్యర్థుల తుది జాబితా విడుదల చేయనున్నారు. క్లర్క్ జీఎం. శ్రీకాంత్ పాల్గొన్నారు.

నంద్యాలలో ఈఎన్‌టీ వైద్యుల రాష్ట్ర సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రైతులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 27: నంద్యాలలో ఏపీ ఈఎన్‌టీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో 15వ రాష్ట్ర స్థాయి ఈఎన్‌టీ వైద్య వైజ్ఞానిక సదస్సు శనివారం ప్రారంభమైంది. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. జాతీయ స్థాయి ప్రముఖ ఈఎన్‌టీ వైద్యనిపుణులు డాక్టర్ మధుసూదన్‌రావు, జాతీయ ఈఎన్‌టీ వైద్య సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ విజయేంద్ర, ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా వైద్యులు అధునాతన పద్ధతుల ద్వారా శస్త్ర చికిత్సలు చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ, తెలంగాణాతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 200 మంది ఈఎన్‌టీ వైద్యులు సదస్సుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ దస్తగిరి రెడ్డి, ఐఎంఏ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు ప్రత్యేక సెల్

కర్నూలు(కలెక్టరేట్), జూలై 27: పంచాయతీరాజ్ శాఖ, రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్, కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదేశాల మేరకు పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించేందుకు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు ఒక ప్రత్యేక సెల్‌ను 08518-277278 ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ పని దినాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు పారిశుధ్యం, తాగునీటి సమస్యలను ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. మహిళ దుర్మరణం

బేతంచెర్ల, జూలై 27: మండలంలోని బలపాలపల్లె గ్రామ సమీపంలో నాపరాళ్ల లోడు ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడగా.. ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న శశికళ (29) కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన శనివారం జరిగింది. పాపసాని కొట్టాల గ్రామానికి చెందిన మధు భార్య శశికళ కోడిగుడ్లు తీసుకురావడానికి బలపాలపల్లి గ్రామానికి వచ్చింది. స్వగ్రామానికి తిరిగి వెళ్తున్న సమయంలో రోడ్డుపై ఉండగా.. పలుకూరు నాపరాళ్ల గనుల నుంచి నాపరాళ్ల లోడుతో బలపాలపల్లె మీదుగా పాపసాని కొట్టాల వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను శశికళ ఎక్కింది. ఎత్తయిన రోడ్డు మీదికి ఎక్కుతుండగా.. అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో శశికళపై నాపరాళ్లు పడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. బేతంచెర్ల పోలీసులు సంఘటనా స్థళానికి చేరుకుని శశికళ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇండియా కూటమితో జగన్ దోస్తీ

- సీఎం హోదాలో ఉన్నప్పుడు దోపిడీ
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు(అర్బన్), జూలై 27: ఇండియా కూటమితో జగన్ దోస్తీ కోసం.. ఢిల్లీ పర్యటన చేపట్టాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆనాడు రూ.కోట్ల అక్రమ సంపాదన కేసులో వైఎస్ జగన్ 16 నెలలు జైలులో ఉండివచ్చారని అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి.. మరోసారి భారీ ఎత్తున అక్రమాలతో రాష్ట్ర సంపాదన దోచేశారని విమర్శించారు.

మంత్రాలయం వద్ద ఉత్తుంగభద్ర

- గంగమ్మ గుడిని చుట్టుముట్టిన వరద నీరు
- నదీ తీరం వద్ద పోలీసుల గస్తీ, గజ ఈతగాళ్ల ఏర్పాటు
- మంత్రాలయం వద్ద 311.270 మీటర్ల నీటి మట్టం
- నదీ తీరాల్లో మునిగిన విద్యుత్ మోటార్లు, పంటలు



మంత్రాలయం వద్ద పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర

మంత్రాలయం, జూలై 27: తుంగభద్రమ్మ పరవళ్లతో శనివారం సాయంత్రం మంత్రాలయం వద్ద స్నానఘట్టాలన్నీ మునిగిపోయాయి. నదితీరంలో ఉన్న గంగమ్మ గుడిని వరద నీరు చుట్టేసి ఉగ్రరూపం దాల్చింది. హోస్పేట్‌లోని తుంగభద్ర డ్యాం నుంచి 1,41,485 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నది దిగువకు విడుదల చేయడంతో మంత్రాలయం వద్ద 311.270 మీటర్ల నీట మట్టంతో 1.28 లక్షల క్యూసెక్కులతో ప్రవాహం ఊపందుకుంది. నది తీర గ్రామాల్లోని కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం మండలాల్లోని నదితీర గ్రామాల్లో వందలాది ఎకరాలు నీటిలో మునిగిపోయాయి. విద్యుత్ మోటార్లు కొన్ని మునిగిపోగా.. కొంత మంది రైతులు మోటార్లను తీసేసి సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నారు. మంత్రాలయం వద్ద పుణ్యస్నానాలకు భక్తులు వెళ్లకుండా శ్రీమఠం అధికారులు ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, ఇన్‌చార్జి తహసీల్దార్ రాఘవేంద్ర, ఎస్ఐ గోపీనాథ్, మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో పోలీసు, మఠం సెక్యూరిటీ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ముందస్తు జాగ్రత్తగా పుట్టీలతో కూడిన గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. సాయంత్రం గ్రామస్థులు, భక్తులు తుంగభద్రమ్మ జలకళను ఆనందంగా తిలకించారు.

నాగలదిన్నె వద్ద తుంగభద్ర జలకళ

నందవరం: నాగలదిన్నె గ్రామం దగ్గర ఉన్న తుంగభద్ర నదికి డ్యాం నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. డ్యాం నుంచి తుంగభద్ర నదికి 95వేల క్యూసెక్కుల నీరు విడుదల అయింది. దీంతో తీర గ్రామాలైన నాగలదిన్నె, నదికైరవాడి, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, గురుజాల, జోహరాపురం రాయచోటి, గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కోరారు. పంపు మోటర్ల దగ్గరకు రైతులు వెళ్లకుండా అధికారులు చూడాలన్నారు.

మతిస్థిమితం లేని రోగి వీరంగం

- వైద్య పరికరాలు ధ్వంసం
- సిబ్బందిపై దాడి..
- రోగిని స్తంభానికి కట్టేసిన ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది
- రోగి ఆరేకల్ గ్రామానికి చెందిన రాఘవేంద్రగా గుర్తింపు



వీరంగం సృష్టిస్తున్న మానసిక రోగి రాఘవేంద్ర

ఆదోని, జూలై 27: ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మతిస్థిమితం లేని రోగి వీరంగం సృష్టించాడు. సెక్యూరిటీ సిబ్బంది అడ్డగించడంతో వారిపై కూడా దాడి చేశాడు. సెలైన్ బాటిల్ ఎక్కించే స్టాండు తీసుకొని ఆస్పత్రిలోని వైద్య పరికరాలను ధ్వంసం చేసి భయానకర వాతావరణం సృష్టించాడు. మండలంలోని ఆరేకల్లు గ్రామానికి చెందిన రాఘవేంద్ర (30)కు గతవారం రోజులుగా మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో చికిత్స నిమిత్తం శనివారం ఆదోని హాస్పిటల్‌కి తీసుకొచ్చారు. క్యాజువాలిటీ వార్డులో తనకు చికిత్స చేస్తున్న వైద్య ఇసబ్బందిని చూసి కొంత భయానికి గురైన రాఘవేంద్ర కేకలు వేస్తూ సిబ్బందిపై దాడికి పూనుకున్నాడు. అక్కడే సెలైన్ బాటిల్ ఎక్కించేందుకు ఉన్న స్టాండ్‌ను తీసుకొని మల్టిపెరా మానిటర్, ఇన్ఫ్యూషన్ పంప్, పారా మానిటర్, ఫ్యాన్‌లను ధ్వంసం చేశాడు. సెక్యూరిటీ సిబ్బంది అతి కష్టం మీద పట్టుకొని తాళ్ళతో స్తంభానికి కట్టేశారు. పోలీసులు వచ్చి అతడ్ని విడిపించి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. అనంతరం రాఘవేంద్ర చిన్నాన్న లక్ష్మన్న చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లారు. రాఘవేంద్ర వీరంగంలో ఆసుపత్రిలో రూ. రెండు లక్షలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు వైద్య అధికారి శ్రీనివాస నాయక్ తెలిపారు. వన్ టౌన్ సీఐ తేజమూర్తి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నల్లమలలో కారును ఢీకొన్న లారీ

వాహనాల రాకపోకలకు అంతరాయం

మహానంది, జూలై 27: మహానంది మండలం నల్లమల ఘాట్ గిద్దలూరు- నంద్యాల ప్రధాన రహదారిలో శనివారం రెండు ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొన్నాయి. దీంతో గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గిద్దలూరు నుంచి నంద్యాల వైపు వస్తున్న కారును చింతమాను మలుపు వద్ద ఇరుకుగా ఉన్న రహదారిలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో వాహనాలు రహదారికి అడ్డంగా పడ్డాయి. వాహనాలు ఎటూ పోలేక నిలిచిపోయాయి. చివరికి వాహనదారులే చొరవ తీసుకొని రోడ్డుకు అడ్డంగా ఉన్న కారును అతి కష్టమ్మీద పక్కకు తొలగించారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

పెద్దపులి దాడిలో బర్రె మృతి

ఆత్మకూరురూరల్, జూలై 27: ఆత్మకూరు మండలం వడ్లరామాపురం గ్రామ శివార్లలో బర్రెలపై పెద్దపులి దాడి చేయడంతో శనివారం ఓ బర్రె మృతి చెందింది. మండల పరిధిలోని వడ్లరామాపురం గ్రామానికి చెందిన నారాయణ అనే వ్యక్తికి చెందిన మూడు బర్రెలను మేపేందుకు గ్రామ శివార్లలోని పొలాలకు శుక్రవారం సాయంత్రం తీసికెళ్లాడు. పొదల మాటు నుంచి వచ్చిన ఓ పెద్దపులి దాడి చేసింది. అక్కడ పొలాల్లో పని చేసుకుంటున్న రైతుల కేకలు వేయడంతో ఆ పులి పారిపోయింది. తీవ్ర గాయాలపాలైన బర్రెను ఆత్మకూరు పశువైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

డిపార్టుమెంట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి

- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- డీఆర్వో మధుసూదన్‌రావు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 27: నేటి నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహించనున్న డిపార్టుమెంట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం డీఆర్వో చాంబరులో డిపార్టుమెంట్ పరీక్షలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో డీఆర్వో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ నగరంలోని సనత్ నగర్ ఐయాన్ డిజిటల్ కేంద్రంలో డిపార్టుమెంట్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రం వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ షాహీదా, ఏపీపీఎస్సీ ఏఎస్‌వో అనిల్ పాల్గొన్నారు.

స్కానింగ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోవడంపై ఆగ్రహం



న్యూ డయాగ్నస్టిక్ బ్లాక్‌లో తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పటల్), జూలై 27: రేడియాలజీ విభాగంలో అల్ట్రాసౌండ్ పరీక్షలను అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకుండా పీజీలు నిర్వహించడంపై కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం ఆయన పలు విభాగాలను తనిఖీ చేశారు. న్యూడయోగ్నస్టిక్ బ్లాకులోని స్కానింగ్ కోసం గర్భిణీలు వెయిట్ చేస్తున్నారని, 8 స్కానింగ్ కేంద్రాల్లో పీజీ విద్యార్థులే చేస్తుండటం, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సగం స్కానింగ్ మిషన్లు మీద ఉండాలనే నియమం ఉన్నా పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అవినీతిపై విచారించాలి: బైరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

జూపాడుబంగ్లా, జూలై 27: రాయలసీమ ఎత్తిపోతల పథకంలో వైసీపీ నాయకుల అతినీతిపై విచారించాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల అనంతరం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. బైరెడ్డి మాట్లాడుతూ జగన్ హయాంలో ఆర్థిక దోపిడీకి పాల్పడి ప్రస్తుతం పిల్ల కాకిలా ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. రాయలసీమ ఎత్తిపోతలకు ఎటువంటి అనుమతి లేకున్నా జగన్, కాంట్రాక్టర్లు పనుల్లో అవినీతికి పాల్పడి డబ్బులు పంచుకున్నారని ఆరోపించారు. సిద్ధేశ్వరం వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తే 60 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుకుని రాయలసీమ ప్రాంతానికి తాగునీటి అవసరాలకు ఉపయోగించుకోవచ్చని అన్నారు. శ్రీశైలం డ్యాంకు కూడా ప్రమాదం పొంచి ఉందని, బ్యారేజీ నిర్మిస్తే సపోర్టుగా ఉంటుందని అన్నారు. వైసీపీ హయాంలోనే గుండ్రేవుల మంజూరైనా జగన్ పట్టించుకోలేదని అన్నారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పనుల కెపాసిటీ పెంచేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతామన్నారు. పోతులపాడు సర్పంచ్ నిర్మలమ్మ, నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు శివానందరెడ్డి, మోహన్‌రెడ్డి, మందాడి కర్నాకర్‌రెడ్డి, ఈదుల కర్నాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసులనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

నందికొట్కూరు: మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో కొత్తపల్లి మండలం శివపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ, మరికొందరు నాయకులు టీడీపీలో చేరారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి నివాసంలో శివపురం గ్రామానికి చెందిన శివన్న, ఎంపీటీసీ మమబూబ్‌బాషా, డీలర్ వెంకట నాయుడు, ఖురాన్ భారతి చైర్మన్ అసిఫ్ బాషా, మాజీ సర్పంచ్ రామకృష్ణ సమక్షంలో దాదాపుగా 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


నూతన చట్టాలపై అవగాహన

నంద్యాల క్రైం, జూలై 27: నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)ను, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ) స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)ను, ఇండియన్ ఎవిడెన్స్ ఆక్ట్ (ఐఈఏ) స్థానంలో భారతీయ సాక్ష అధినియం (బీఎస్ఏ) ఈ ఏడాది జూలై 1 నుంచి అమల్లోకి తెచ్చిందని చెప్పారు. కొత్త చట్టాలను వివరించి ప్రజలు, విద్యార్థులు ఏ విధంగా న్యాయం పొందాలనే అంశంపై పోలీస్ అధికారులు వివరిస్తున్నారు. మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాలు వాటికి ఉన్న శిక్షలు, బాల్య వివాహాలవల్ల కలిగే దుష్ప్రభావాలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ర్యాగింగ్, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు సేవించడంవల్ల కలిగే నష్టాల గురించి నంద్యాల పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో శనివారం అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. నేషనల్ డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో డీఎస్పీ ఎన్.రవీంద్రనాథ్‌రెడ్డి, సీఐ రాజారెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన సదస్సులో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సూర్యమౌళి, న్యాయవాది శ్రీదేవి, ఎస్ కుమారి అవగాహన కల్పించారు. అలాగే రైల్వేస్టేషన్ రోడ్డులోని ఐకాన్ స్కూల్‌లో నంద్యాల త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ నరసింహులు అవగాహన కల్పించారు. నందమూరినగర్‌లో జరిగిన కార్యక్రమంలో నంద్యాల తాలుకా అర్బన్ ఇన్‌స్పెక్టర్ దస్తగిరిబాబు పాల్గొని నూతన చట్టాలపై అవగాహన కల్పించారు.

'సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు'

గడివేముల, జూలై 27: పంట సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి హేమసుందర్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని గని గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు క్రమం తప్పకుండా పంట పొలాన్ని పరిశీలించాలని అన్నారు. పంట తెగుళ్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సహజ శత్రువులను కాపాడటం వలన పంటకు పురుగుల బెడదను నివారించవచ్చని అన్నారు. అధికంగా క్రిమి సంహారక మందులను పంటలపై పిచికారి చేయరాదని అన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సలహాలను పాటించాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'వ్యాధినిరోధక శక్తిని పెంచుకోవాలి'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్

పాములపాడు, జూలై 27: విద్యార్థులు వ్యాధినిరోధక శక్తిని పెంచుకోవాలని టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ సూచించారు. మిట్టకందాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు క్షయవ్యాధి నివారణపై శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ 15 రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, నీరసం ఉన్నవారు తప్పనిసరిగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. పాములపాడులో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సీహెచ్‌వో రత్నమ్మ, ఆశీర్వాదమ్మ, నాగమణి, ఆశా కార్యకర్తలు, హెచ్ఎం మోహనరావు, వాణి తదితరులు పాల్గొన్నారు.

'సీజన్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు'



ఎస్సీ బాలుర వసతి గృహంలో దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తున్న వైద్య బృందం

ఆత్మకూరురూరల్, జూలై 27: సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ తెలిపారు. శనివారం వెంకటాపురం గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి విద్యార్థుల్లో జ్వరపీడితుల రక్తనమూనాలు సేకరించారు. చిరు వ్యాధులకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సీజన్ వ్యాధులు బారిన పడకుండా రక్షణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే డెంగీ కారక దోమల నివారణ కోసం మలాథియాన్ ద్రావణాన్ని విద్యార్థుల గదుల్లో పిచికారి చేయించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల బారిన పడకుండా తప్పకుండా దోమతెరలు వాడాలని, డెంగీ బారిన పడకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే తాగునీటి ట్యాంకును శుభ్రం చేయించి క్లోరినేషన్ చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, వసతి గృహ సంరక్షకుడు అంకన్న, ఆరోగ్య కార్యకర్తలు విశ్వనాథ్, పద్మావతమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి



నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి ఫరూక్



మంత్రికి పూలమొక్క అందజేస్తున్న ఎస్పీ

నంద్యాల (నూనెపల్లె), జూలై 27: నంద్యాల నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శనివారం నంద్యాల టీడీపీ కార్యాలయంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో పాటు రాష్ట్ర నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలను పరిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ శాసనసభ సమావేశాల అనంతరం నంద్యాలకు వచ్చామని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే విధంగా పని చేస్తామని అన్నారు.నంద్యాల అభివృద్ధే తమ లక్ష్యమని, త్వరలోనే నంద్యాలలో కాలువలు, రోడ్లు, మంచి నీటి వసతి కల్పించి సౌకర్యాలను మెరుగు పరుస్తామని చెప్పారు.

ఉమ్రా యాత్రకు బయలుదేరిన యాత్రికులు

నంద్యాల (నూనెపల్లె): నంద్యాల సాయిబాబా నగర్ కుబ్రా మసీదు నుంచి ఉమ్రా యాత్రకు ముస్లింల బృందం శనివారం బయలు దేరారు. టీడీపీ రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో ఇమాముల సంఘం అధ్యక్షుడు అమ్జాద్‌బాషా సిద్దికీ, మత పెద్దలు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌ను కలిసిన ఎస్పీ

నంద్యాల క్రైం: ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నంద్యాల ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అధిరాజ్ సింగ్ రాణా శనివారం నంద్యాల ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి ఫరూక్‌ను కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం జిల్లా అభివృద్ధి, పోలీస్ సంక్షేమం, గంజాయి నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత'



శింగవరం హైస్కూల్‌లో మొక్కలతో విద్యార్థులు



మొక్కకు నీరు పోస్తున్న గడిగరేవుల హైస్కూల్ సిబ్బంది

బండిఆత్మకూరు, జూలై 27: నానాటికి పెరిగిపోతున్న భూతాపం, పర్యావరణ కలుషితం, కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉందని నంద్యాల జిల్లా నేషనల్ గ్రీన్ కార్ప్స్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని శింగవరం హైస్కూల్‌లో శనివారం శిక్ష సప్తహ్ కార్యక్రమం హెచ్ఎం దస్తగిరి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా విద్యార్థుల చేత పాఠశాల ఆవరణలో అమ్మ పేరిట ఒక మొక్క అన్న నినాదంతో మొక్కలు నాటించారు. ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను బాధ్యతతో పెంచాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, టీడీపీ నాయకులు నబీరసూల్, మణికంఠ, ధనుంజయగౌడ్, మల్లికార్జున పాల్గొన్నారు.

మహానంది: పర్యవరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తిమ్మాపురం జడ్పీ పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీకాంత్ అన్నారు. మండలంలోని తిమ్మాపురం జడ్పీ పాఠశాల ఆవరణలో పర్యవరణ పరిరక్షణలో భాగంగా శనివారం హెచ్ఎం ఆధ్వర్యంలో ఉపాధ్యాయిలు, విద్యార్థుల చేత వివిధ రకాల మెక్కలు నాటించారు. అంతకుముందు విద్యార్థులతో జీవ వైవిధ్యం.. పరిరక్షణ ప్రకృతిపై ప్రతిజ్ఞ సైన్స్ ఉపాధ్యాయిడు సుబ్బరాయుడు, ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెలుగోడు: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం జీఎస్ విశంకర్ పేర్కొన్నారు. శనివారం ఆ పాఠశాల ఆవరణంలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సమగ్ర శిక్ష, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులతో పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం,సుబ్బయ్య, నరసింహులు మొయినుద్దీన్,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: పర్యావరణ పరిరక్షణతోనే మానవుని మనుగడ సాధ్యపడుతుందని వెంకటాపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ పేర్కొన్నారు.శనివారం మండలంలోని వెంకటాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలను నాటి వారికి దతత్త ఇచ్చారు. ఉపాధ్యాయులు జవహర్‌నాయక్, దాదాపీరా, దాసు, కృష్ణుడు, శోభన్, పుష్పలత, స్నేహలత, సంజమ్మ, మంజువాణి, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

వీబీఆర్‌కు కృష్ణా జలాలు



వెలుగోడు జలాశయంలోకి చేరుతున్న కృష్ణా జలాలు

వెలుగోడు, జూలై 27: తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు జలాశయానికి కృష్ణా జలాలు చేరుకుంటున్నాయి. శనివారం పోతిరెడ్డి పాడు వద్ద ప్రజా ప్రతినిధులు గంగ అధికారులు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయడంతో ఆ జలాలు బానకచెర్ల మీదుగా లింక్ చానల్ ద్వారా సుమారు వెయ్యి క్యూసెక్కుల నీరు వచ్చి చేరినట్లు తెలుగుంగ ఏఈ శివనాయక్ తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 1.046 టీఎంసీల నీరు నిలువ ఉన్నట్లు ఆయన వివరించారు. జలాశయానికి కృష్ణా జలాలలు చేరుకుంటుండటంతో రైతులు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు

4న జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

నంద్యాల (నూనెపల్లె), జూలై 27: ఉమ్మడి కర్నూలు బాల్‌బ్యాడ్మింటన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 4వ తేదీ గుడ్‌షెపర్డ్ పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సబ్ జూనియర్స్ బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ చైర్మన్ చిన్నప రెడ్డి కార్యదర్శి మద్దిలేటి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 2-1-2009 తర్వాత పుట్టిన వారై ఉండాలని తెలిపారు. ఉదయం 8 గంటలలోపు హాజరు కావాలని పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వారి పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందన్నారు. రూ.100 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేసి, ఎంపికైన జట్లు సెప్టెంబరు 13 నుంచి 15 వరకు తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలో జరిగే ఏపీ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

'ఎరువులు అందుబాటులో ఉంచాలి'

కొత్తపల్లి, జూలై 27: రైతు సేవా కేంద్ర సిబ్బంది ఆయా గ్రామాల్లోని రైతులకు ఎరువులను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయాధికారి మహేష్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కొత్తపల్లిలోని వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని రైతు సేవా కేంద్ర సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న కౌలు రైతులు ఎవరైతే ఉన్నారో.. వారిని క్షేత్ర స్థాయిలో గుర్తించి కౌలు కార్డులు ఇప్పించాలని చెప్పారు. అలాగే పీఎం కిసాన్ ఫిజికల్ వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామ స్థాయి రైతు సేవా సిబ్బంది కచ్చితంగా సమయ పాలన పాటించి రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే వర్షాల వల్ల నీట మునిగిన పంటలను గుర్తించి రైతులకు పలు సూచనలు చేస్తూ వారికి భరోసా కల్పించాలన్నారు.

'హామీలు అమలు చేయాలి'



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

నంద్యాల (నూనెపల్లె), జూలై 27: ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. శనివారం నంద్యాలలోని నేషనల్ పీజీ కళాశాలలో డీవైఎఫ్ఐ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అధ్యక్షుడు రాము అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యదర్శి రామన్న మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రాంభూపాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, ఉద్యోగాలు లేక యువకులు కూలీ పనులు చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పోస్టులను భర్తీ చేయాలని నూతన పరిశ్రమలను స్థాపించి ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శంకరయ్య, శివ, మధుశేఖర్, వివిధ జిల్లాల నుంచి జిల్లా ప్రతినిధులు తదిరతులు పాల్గొన్నారు.

'వన్యప్రాణులను సంరక్షించుకోవాలి'

కొత్తపల్లి, జూలై 27: అడవులు, వన్యప్రాణులను99 సంరక్షించుకోవాలని ఆత్మకూరు అటవీ సెక్షన్ అధికారి జ్యోతి స్వరూప్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 29న ఇంటర్నేషనల్ టైగర్స్ డేను పురస్కరించుకుని శనివారం ఆత్మకూరు రేంజ్ అధికారి పట్టాభి ఆదేశాల మేరకు జ్యోతి స్వరూప్ కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు అడవులు, పులుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రధానంగా అటవి ప్రాంత సమీప గ్రామాల ప్రజలు రాత్రివేళల్లో బయటకు రాకూడదన్నారు. అత్యవర పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే శబ్దాలు చేస్తూ వెళ్లాలన్నారు. పులి దట్టమైన అటవి ప్రాంతంలోని కొండలు, కొండగుట్టలు, నీళ్ల ఉండే ప్రాంతాలలో అవాసాలు ఏర్పాటు చేసుకుంటాయన్నారు. అలాంటి ప్రాంతాలకు వెళ్లకూడదని సూచించారు. అనంతరం అడవులు, పెద్ద పులుల సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఎఫ్‌బీవో కృష్ణకాంత్, హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై అవగాహన

నంద్యాల రూరల్, జూలై 27: మండల సామాజిక తనిఖీ 18వ విడతపై ఎంపీడీవో సౌభాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, మండల అధికారులు పాల్గొన్నారు. ఈనెల 29 వతేదీ నుంచి గ్రామ పంచాయతీలో జరిగే 18వ విడత సామాజిక తనిఖీలో అందించాల్సిన రికార్డులను, తనిఖీ చేయు విధానంపై అవగాహన కల్పించారు.

వేలం పాటలు వాయిదా

నంద్యాల టౌన్, జూలై 27: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో మార్కెట్ గేట్ల వసూళ్లు, సైకిల్ స్టాండ్ నిర్వహణకు సంబంధించిన వేలం పాటలను వాయిదా వేశారు. శనివారం సహాయ కమిషనర్ అంకిరెడ్డి ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. మార్కెట్ గేట్ల వసూళ్లకు సంబంధించి వేలంపాటలో పాల్గొనేందుకు ఒక్కరు మాత్రమే రావడంతో వాయిదా వేశామని చెప్పారు. సైకిల్ స్టాండ్ నిర్వహణకు సంబంధించి పోటీలో పాల్గొనేందుకు ఇద్దరు పాటదారులు హాజరైనప్పటికీ ప్రభుత్వ నిర్ణీత మొత్తాన్ని తగ్గించాలని కోరారు. ఐతే తగ్గింపు సాధ్యం కాదని అధికారులు ప్రకటించి వేలంపాట వాయిదా వేశారు. గత ఏడాది సైకిల్ స్టాండ్ నిర్వహణకు తాను హెచ్చుపాటదారుడిగా నిలిచినప్పటికీ టీడీపీకి చెందిన వ్యక్తినని వర్క్ ఆర్డర్ ఇవ్వకుండా వైసీపీ నాయకులు అడ్డుపడ్డారని.. తనకే వర్క్ ఆర్డర్ ఇప్పించాలని పాటదారుడు జాకీర్ మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై కార్యాలయ పనివేళల్లో అధికారులను సంప్రదించాలని సూచించారు.

అంధకారంలో కొండజూటూరు



వెలగని వీధి దీపాలను చూపుతున్న కొండజూటూరు గ్రామస్థులు

పాణ్యం, జూలై 27: మండలంలోని కొండజూటూరులో గత కొంత కాలంగా వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ టీడీపీ నాయకుడు కేశవ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని వీధులన్నీ అంధకారంలో ఉండడంతో కుక్కలు, విషపురుగులతో ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పలు మార్లు మండల అధికారులకు సమస్యను విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇంకా వైసీపీ పాలనలోనే గ్రామం ఉందని, వైసీపి నాయకులకు అధికారులు భయపడుతున్నారని ఆరోపించారు. ఇదే పరిస్థితి ఏర్పడితే కలెక్టరు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. పంచాయతీ సభ్యులు వినోద్ కుమార్, దాసు, జానుబాబు, ఆశీర్వాదం, గుర్రం స్వరాజు కేశవ పాల్గొన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సరోజినీదేవి మాట్లాడుతూ నిధుల కొరత కారణంగా వీధి దీపాలు వేయలేదని, త్వరలో ఏర్పాటు చేస్తామని చెప్పారు.

'పండ్ల తోటలు సాగు చేయాలి'

పగిడ్యాల, జూలై 27: ఐదు ఎకరాల పొలం ఉండి నీటి వసతి కలిగిన రైతులు తమ పొలంలో పండ్ల తోటలను సాగు చేసేందుకు ముందుకు వస్తే రైతులకు ఉచితంగా చెట్లను అందజేయడంతోపాటు వాటిని పెంచడానికి ప్రభుత్వం నిదులు మంజూరు చేయనున్నట్లు ఉపాధి మేటీ, ట్రైనింగ్ కోఆర్డినేటర్ వీరన్న తెలిపారు. మండలంలోని ప్రాతకోట గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల సాగుపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈసీ అశోక్, టీఏలు శ్రీకాంత్, చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల దృష్టికి సమస్యలు: ఎమ్మెల్యే



చంద్రబాబుతో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, జూలై 27: నియోజకవర్గంలోని తాగు, సాగునీటి సమస్యలకు పరిష్కారం చూపాలని వివిధ శాఖల మంత్రులను కోరినట్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ తదితర శాఖల మంత్రులను టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డితో కలిసి మంత్రులను కలిశారు. కొత్తపల్లి మండలంలో గుమ్మడాపురం ఎస్ఎస్ ట్యాంక్, మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణం కోసం 2017-18లో టీడీపీ హయాంలో ప్రారంభించిన ఈ ప్రాజెక్ట 60 శాతం పూర్తయిందని, గత ఐదు సంవత్సరాల పాటు ఎక్కడ వేసిన గొంగళి అన్నట్లు ఉందన్నారు. మిగిలిన 40 శాతం పనులను పూర్తి చేయించి మండలంలోని తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీఎం చంద్రబాబును కోరినట్లు ఆయన తెలిపారు.

- వైసీపీ మయాంలో మిడ్తూరు మండలంలోని అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనుల నుంచి చేసి మధ్యలోనే జారుకున్నారని అన్నారు. ఎవరు పనులు చేశారు? ఎంత ఖర్చు చేశారు...? ఎన్ని నిధులు డ్రా చేశారన్న అంశాలపై విచారణ జరిపించాలని ఆయన ఇరిగేషన్ శాఖామంత్రిని కోరినట్లు తెలిపారు. వెంటనే అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన మంత్రిని కోరినట్లు తెలిపారు.
- నందికొట్కూరు నుంచి పగిడ్యాల మండల కేంద్రం వరకు డబుల్‌లైన్ రోడ్డును వేయాలని ఆర్అండ్‌బీ శాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించామన్నారు. అలాగే అలంపూర్ బ్రిడ్జి పడడంతో రాకపోకలు పెరిగాయని, అల్లూరు నుంచి బ్రాహ్మణకొట్కూరు వరకు డబుల్‌లైన్ బీటీ రోడ్డు వేయాలని మంత్రికి వినతిపత్రం సమర్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

పగిడ్యాల, జూలై 27: మండలంలోని పడమర ప్రాతకోట గ్రామాని చెందిన టీడీపీ కార్యకర్త మిద్దె పెద్ద రాముడు (70) అనారోగ్యంతో శనివారం మృతి చెందడంతో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సంతాపం తెలిపారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సుదకద నాముడు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనరు పలుచాని మహేశ్వరరెడ్డి, మాండ్ర సురేంద్రనాధరెడ్డి, నాగశేషులు, వెంకటేశ్వర్లు, దత్తు తదితరులు ఉన్నారు.

చెంచులకు ఆధార్ క్యాంపు



ఆధార్ నమోదు చేసుకుంటున్న చెంచులు

పాణ్యం, జూలై 27: పాణ్యంలోని ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులో దాదాపు 55 మంది చెంచులు పాల్గొన్నారు. ఇందులో 11 మందికి మాత్రమే ఆధార్ నమోదు చేశారు. బయోమెట్రిక్ నమోదుకు విద్యుత్ కోత, సర్వర్ సమస్య, అలాగే ఇతర కారణాల వల్ల మిగతా వారికి నమోదు చేయలేదు. ఎంపీడీవో భాగ్యలక్ష్మి, సచివాలయ కార్యదర్శి శివ, వీఆర్వో శ్రీనివాస్, వెల్ఫేర్ అసిస్టెంట్ వాణి, టెక్నికల్ అసిస్టెంట్ యాస్మిన్, టీడీపీ నాయకలు ఖాదర్‌బాషా, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

31న పాలిటెక్నిక్ కోర్సులకు కౌన్సెలింగ్

నంద్యాల (నూనెపల్లె), జూలై 27: ఈ విద్యా సంవత్సరానికి పాలిటెక్నిక్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ కోసం ఈ నెల 31న అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. పాలిటెక్నిక్ నందు వివిధ డిప్లొమా కోర్సులలో 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అలాగే అదనంగా ఈడబ్ల్యూఎస్ కింద 18 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ దరఖాస్తు ఫారంలను ఈ నెల 29న ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సమర్పించి 31న జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు మరిన్ని వివరాలకు 9912377723,9440021417 నెంబర్లలో సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన కోరారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

నందికొట్కూరు, జూలై 27: నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం పంపిణీ చేసే ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను ప్రిన్సిపాల్ షేక్షావలి విద్యార్థులకు పంపిణీ చేశారు. గ్రంథాలయ అధ్యాపకురాలు సుజాత మాట్లాడుతూ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వన్నూరు వలి, అధ్యాపకులు సురేష్‌బాబు, వెంకటప్రసాద్, నరేంద్ర, సునీల్, రాధిక, జ్యోత్స్న, రియాజ్, చంద్రహాస్, వెంగన్న, సంధ్యాకిరణ్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

'జేసీని కలిసిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు'



జేసీకి స్వామి చిత్రపటం అందిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 27: జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన విష్ణుచరణ్‌ను కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి, వైస్ చైర్మన్ మారుతి కుమార్, కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు ఉస్మాన్‌బాషా మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సంస్థ చేపడుతున్న పలు కార్యక్రమాల గురించి జేసీకి వివరించారు. జేసీ ఆధ్వర్యంలో జూనియర్ రెడ్‌క్రాస్ యూత్ కమిటీలు ఏర్పాటు చేసి వాటి ద్వారా విద్యార్థులకు పీవీఆర్ ఫస్ట్ ఎయిడ్‌పై శిక్షణ ఇవ్వాలని, ప్రకృతి విపత్తు సమయంలో సహకరించే వలంటీర్లుగా శిక్షణ ఇచ్చేలా కార్యక్రమాలు చేపట్టాలని జేసీ సూచించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపాన్నారు.

'మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలి'

నందికొట్కూరు, జూలై 27: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎత్తివేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మహానంది, వినోద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎత్తివేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి ప్రారంభిస్తామని యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖమంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కళాశాల ప్రారంభమై నేటికి దాదాపు రెండు నెలలు అవుతున్నప్పటికీ మధ్యాహ్న భోజన పథకంపై ఎటువంటి స్పందన లేకపోవడం చాలా బాధాకరమన్నారు. పేద బడుగు బలహీన వర్గాల పిల్లలు అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జూనియర్ కళాశాల కమిటీ నాయకులు క్రాంతి కుమార్, హేమంత్, సాయి, ప్రవీణ్, శ్రీనాథ్, అఖిల్, అర్జున్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాల ప్రకారం మెలగాలి: న్యాయాధికారి



మాట్లాడుతున్న డోన్ సబ్ కోర్టు న్యాయాధికారి తంగమణి

ప్యాపిలి, జూలై 27: చట్టాలను అనుసరించి మెలగాలని డోన్ సబ్ కోర్టు న్యాయాధికారి తంగమణి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మానవీయ నైతిక విలువలు, బాలికా సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలిక సంరక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయన్నారు. వాటిని అవగాహన చేసుకొని ధైర్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సీఐ సుధాకర్‌రెడ్డి, న్యాయవాది వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, అధ్యాపకులు నవీన్‌పాటి, విద్యార్థి, విద్యార్థినీలు పాల్గొన్నారు.

మా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి



ఎమ్మెల్యే కోట్లతో చర్చిస్తున్న జనసేన నాయకులు

డోన్, జూలై 27: ప్రజలకు ఏ సమస్య వచ్చినా, ఏ ఇబ్బందులు ఉన్నా.. చెప్పుకోవడానికి మా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం లద్దగిరిలోని కోట్ల నివాసంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సమర్థవంతమైన పాలనతో రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలకు మేలు చేసేందుకు సీఎం చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలకు జనసేన, బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉండడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉండటంతో కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి న్యాయం జరిగిందన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపాల్

బనగానపల్లె, జూలై 27: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నందివర్గం ఎస్ఐ తిరుపాల్ అన్నారు. శనివారం మండలంలోని నందవరం పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ప్రతి విషయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి ఆదాయం రూ.3.21 లక్షలు

బేతంచెర్ల, జూలై 27: మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.3.21 లక్షలు వచ్చినట్లు ఉపకమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు శనివా రం తెలిపారు. స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.3,21,561ల ఆదాయం దేవస్థానానికి లభించినట్లు ఆయన తెలిపారు.

తహసీల్దారుకు సన్మానం

కోవెలకుంట్ల, జూలై 27: మండల తహసీల్దారు జయప్రకాశ్‌ను శనివారం డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది కలిసి ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బదిలీల్లో భాగంగా కోవెలకుంట్లలో పనిచేసే తహసీల్దారు పుష్పకుమారి చిత్తూరు జిల్లాకు బదిలీ కాగా చిత్తూరు జిల్లాలో పని చేసే జయప్రకాశ్ కోవెలకుంట్లకు బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కోవెలకుంట్లలో విధులు నిర్వహించి మంచి సేవలం దించారు. ఇటీవల జయప్రకాశ్‌ను చిత్తూరు జిల్లాకు బదిలీ కావాలని ఉన్నతాధికారుల ఆదేశించడంతో వారి ఆదేశాల మేరకు శనివారం ఆయన రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్, వీఆర్వోలు కలిసి తహసీల్దారు జయప్రకాశ్‌కు శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు.

'రైతులకు అందుబాటులో ఉండాలి'

చాగలమర్రి, జూలై 27: గ్రామాల్లో పశువైద్య సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ సూచించారు. శనివారం చాగలమర్రి పశువైద్య కేంద్రంలో పశువైద్యాధికారులు, వెటర్నరీ అసిస్టెంట్‌లు, పశువైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పశువైద్యాధికారులు సాయిబాబా, దీపకుమారి పాల్గొన్నారు.

శాకంబరి అలంకారంలో అమ్మవారు

చాగలమర్రి, జూలై 27: చాగలమర్రిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారు శాకంబరి అలంకారంలో కొలువుదీరారు. మహిళలు సామూహికంగా పండ్లు, కూరగాయలు, ఆకులతో అమ్మవారిని అలంకరించారు. లలిత సహస్ర పారాయణం, సామూహిక వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. వెండి రథంలో అమ్మవారిని కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ వర్క్‌షాపునకు డోన్ వాసి ఎంపిక

డోన్(రూరల్), జూలై 27: తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు దోమలగూడలో రామకృష్ణ మాత్ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా నిర్వహించిన జాతీయ వర్క్‌షాపుకు డోన్ మండలం మల్యాల గ్రామానికి చెందిన యువకుడు నల్లబోతుల సురేష్ ఎంపికయ్యారు. శనివారం జరిగిన భారతీయ విద్యాదృష్టి-విద్యావంతుల పాత్ర అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాపులో సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గురించి నల్లబోతుల సురేష్ తన అభిప్రాయాన్ని తెలియజేశారు.

'పండ్ల తోటల సాగుపై దృష్టి పెట్టాలి'

చాగలమర్రి, జూలై 27: పండ్ల తోటల సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏపీవో నిర్మల సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో శనివారం సర్పంచ్ నేట్ల మహేశ్వరి అధ్యక్షతన పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏపీవో మాట్లాడుతూ ఈ ఏడాది 300 ఎకరాలు లక్ష్యం ఉందని అన్నారు. రైతులకు వందశాతం సబ్సిడీతో 16 రకాల పండ్ల మొక్కలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మూడేళ్ల పాటు ఉపాధి నిధులు మంజూరవుతాయని చెప్పారు.

అబ్దుల్‌కలాం సేవలు చిరస్మరణీయం



చాగలమర్రి బాలుర పాఠశాలలో అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

చాగలమర్రి, జూలై 27: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని హెచ్ఎం కోటయ్య అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో అబ్దుల్‌కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన సేవల గురించి కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు, పీడీ దాదాపీర్, పీఈటీ భారతి, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే చాగలమర్రి టీడీపీ కార్యాలయాల్లో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, బీసీ సెల్ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ అధికార ప్రతినిధి సల్లా నాగరాజు ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. టీడీపీ నాయకులు గుత్తి నరసింహులు, జెట్టి నాగరాజు, గఫార్, మురళి, శ్యాబుల్, అజీమ్, నూర్‌బాషా, మహబూబ్‌బాషా, ఓబులేసు, గాంధీ, చోటు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ఆదర్శప్రాయుడని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం జిల్లా అధ్యక్షుడు అమీర్‌బాషా, పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి అన్నారు. కలాం వర్ధంతిని పురస్కరించుకొని ఆళ్లగడ్డ పట్టణంలోని పోలీస్ స్టేషన్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లె: యువత అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలని న్యాయవాది రఫి అన్నారు. శనివారం బనగానపల్లె పట్టణంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మహబూబ్ బాషా, చాంద్ బాషా, చౌదరి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలల్లో అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పించి, దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు సుంకన్న, నారాయణరెడ్డి పాల్గొన్నారు



ఆళగడ్డలో.



బనగానపల్లెలో..



ప్యాపిలిలో..

ప్యాపిలి: పట్టణంలోని మహాత్మా గాంధీ సర్కిల్ దగ్గర శనివారం దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వయోవృద్ధుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాబాసాహెబ్, శ్యాంసన్, బైసాని సురేష్ పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన



చాగలమర్రిలో మాట్లాడుతున్న ఆళ్లగడ్డ డీఎస్పీ

చాగలమర్రి, జూలై 27: చాగలమర్రి గ్రామంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో కొత్త చట్టాలపై ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ మహిళా పోలీసులు, పోలీసులకు శనివారం పలు సూచనలు ఇచ్చారు. ప్రజలకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొత్త చట్టం అమలులోకి వచ్చిందని అన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని అన్నారు. నూతన చట్టం ద్వారా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ రమణయ్య, పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన చట్టాలపై విద్యార్థులకు పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి అవగాహన కల్పించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రజ్ఞ విద్యా సంస్థల్లో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు అవగాహన చేసుకోవాలని, మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సీఐ చంద్రబాబు సూచించారు. శిరివెళ్లలోని పోలీస్ స్టేషన్‌లో కొత్త చట్టాలపై ఆయన ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఐపీసీ, సీఆర్‌పీసీల స్థానంలో భారతీయ న్యాయ సంహిత, నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం వంటి కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని వివరించారు. ఐపీసీలోని 511 సెక్షన్లకు గాను 358 కొత్త చట్టాలను రూపొందించారన్నారు. ప్రజలకు మెరుగైన న్యాయ సేవలు అందించడమే వీటి లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలి: డీఈవో



శిరివెళ్లలో మొక్క నాటుతున్న డీఈవో, అధికారులు, విద్యార్థులు

శిరివెళ్ల, జూలై 27: విద్యార్థులు పాఠశాల వనరులను సద్వినియోగం చేసుకుని సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డీఈవో సుధాకర్ రెడ్డి సూచించారు. శిరివెళ్లలోని మోడల్ స్కూల్‌లో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయన శనివా రం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ విరివిరిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో ఎకో క్లబ్‌ను నిర్మించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో పలు ఆవిష్కరణలను డీఈవో పరిశీలించారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లలిత కుమారి, ఎంఈవోలు డీటీ శంకర్ ప్రసాద్, నాగార్జునరెడ్డి, ఉర్దూ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ యూనుస్, ప్రిన్సిపాల్ ఇష్రత్ బేగం, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, బీసీ ఫిదా హుసేన్, పీపీ లింగమయ్య, సగ్గెల లింగమయ్య, షఫీవుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్క నాటుతున్న ఆర్యవైశ్య మహిళలు

కోవెలకుంట్ల, జూలై 27: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోవెలకుంట్ల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం భార్య విజయలక్ష్మి, లింగాల వందనలు అన్నారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలోని మారెమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన సుమారు 60 మంది ఆర్యవైశ్య మహిళలు కలిసి చీర, సారె, వడిబియ్యం తీసుకుని ఆలయానికి వచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం వారు మొక్కలు నాటారు.

చెట్లు ప్రగతికి మెట్లు: చెట్లు ప్రగతికి మెట్లు అని కోవెలకుంట్ల ఎంఈవో వెంకటసుబ్బయ్య అన్నారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంతోపాటు మండలంలోని వివిధ పాఠశాలలకు జామ, సపోటా, పండ్ల మొక్కలతో పాటు వివిధ రకాల పూల మొక్కలు పంపిణీ చేశారు.

ఉయ్యాలవాడ: మొక్కల పెంపకం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంఈవో ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఉయ్యాలవాడ ప్రాథమిక రెగ్యులర్ పాఠశాలలో మొక్కలు నాటారు. హెచ్ఎం ఆదాం పాల్గొన్నారు.

చాగలమర్రి: మొక్కల సంరక్షణ అందరి బాధ్యతని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల అన్నారు. శనివారం చాగలమర్రి కేజీబీవీలో శిక్షసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు.

నందవరం చౌడేశ్వరి సన్నిధిలో జేసీ



పూజలు నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

బనగానపల్లె, జూలై 27: నందవరం చౌడేశ్వరీ మాత ఆలయాన్ని నంద్యాల జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

చాగలమర్రి, జూలై 27: మండలంలోని కొలుములపేట, చాగలమర్రి గ్రామాల్లో రైతులు సాగు చేసిన చీనీ చెట్లను ఉద్యానశాఖ సహాయ అధికారులు దేవేంద్ర, ఉమామహేశ్వరి శనివారం సందర్శించారు. చీనీ ధర పతనం అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతి కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్, ఉద్యానశాఖ అధికారుల ఆదేశాల మేరకు చీనీ తోటలను పరిశీలించి రైతులకు తెగుళ్లు, వాటి నివారణ గురించి అవగాహన కల్పించారు. ఆళ్లగడ్డ ఉద్యానశాఖ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ చీనీ పంటలో ఒక సంవత్సరానికి మూడు దఫాలుగా పూత వస్తుందని చెప్పారు. జూలై, ఆగస్టు మాసాల్లో చీనీ తోటల నుంచి వచ్చిన పంటకు ధర తక్కువగా ఉంటుందన్నారు. దీన్ని అధిగమించడానికి ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో ఎండుగకు గురి చేసినట్లైతే వేసవి కాలంలో ఏప్రిల్, మే నెలలో పంట అధిక దిగుబడి వచ్చి అధిక ధర లభిస్తుందన్నారు. అధిక వేడి, అధిక వర్షాలు రావడం వల్ల వేరు కుళ్లు ఎక్కువై చెట్లు దెబ్బతింటా యన్నారు. దీనికి రసాయనిక మందులు పిచికారీ చేసి వైరస్ నివారించుకోవచ్చన్నారు. వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

కోవెలకుంట్ల, జూలై 27: పశువులకు సకాలంలో టీకాలు వేయించాలని కోవెలకుంట్ల పశుసంవర్ధకశాఖ ఏడీ వీరబ్రహ్మం అన్నారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలోని ఏడీ పశువైద్య కార్యాలయంలో కోవెలకుంట్ల, గోస్పాడు మండలాలకు చెందిన పశువైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ పశువులకు గొంతువాపు, జబవాపు, కిటుక, ముద్ద చర్మ వ్యాధులకు టీకాలు వేస్తున్నామన్నారు. అలాగే మినీ గోకులాల షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. కోవెలకుంట్ల మండలానికి 25 షెడ్లు, గోస్పాడుకు 25 షెడ్లు మంజూరైనట్లు తెలిపారు.

బీజేపీ కార్యకర్తల పాదయాత్ర

బనగానపల్లె, జూలై 27: బీసీ జనార్ధన్‌రెడ్డికి మంత్రి పదవి రావడంతో బీజేపీ నాయకులు మహానంది పుణ్యక్షేత్రానికి పాదయాత్ర ప్రారంభించారు. శనివారం బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శరత్ చంద్రకుమార్ కార్యకర్తలతో కలిసి పాదయాత్రను ప్రారంభించారు.

పింఛన్ సొమ్ము విడుదల

కొలిమిగుండ్ల, జూలై 27: మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించి ఆగస్టు నెల సామాజిక పింఛన్ సొమ్మును ప్రభుత్వం విడుదల చేసినట్లు కొలిమిగుండ్ల ఎంపీడీవో ప్రసాదరెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని 16గ్రామ సచివాలయాలకు సంబంధించి 7,133 మంది వివిధ రకాల సామాజిక పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని అన్నారు. వీరికి సంబంధించి రూ.3,064,2000 మొత్తాన్ని విడుదల చేసినట్లు ఆయన వివరించారు.

సబ్సిడీపై గోకులం షెడ్ల నిర్మాణం

కొలిమిగుండ్ల, జూలై 27: పాడి పరిశ్రమను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సబ్సిడీపై మినీ గోకులం షెడ్ల నిర్మాణం చేపడుతోందని మండల పశువైద్యాధికారి పద్మావతి అన్నారు. పశువుల షెడ్లకు సంబంధించి ప్రభుత్వం 90శాతం సబ్సిడీ అందిస్తుందని అన్నారు. మేకలు, గొర్రెలు, కోళ్ల షెడ్లకు సంబంధించి 70శాతం సబ్సిడీ అందించనున్నట్లు ఆమె వివరిం చారు.

గుడిసె దగ్ధం

రుద్రవరం, జూలై 27: రుద్రవరంలో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గుడిసె కాలిపోయింది. జయంతి అనే మహిళ వంట చేస్తుండగా తిరువాత పొయ్యి మీద పెట్టి కుమారుడు ఏడుస్తుంటే బయటికి వెళ్లారు. ఒక్కసారిగా మంటలు చెలరేగి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలోని వంటపాత్రలు దుస్తులు, టీవీ బియ్యం జొన్నలు కాలి బూడిదయ్యాయి. రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

రైలు నుంచి కింద పడి యువకుడి మృతి



రజనీకాంత్(ఫైల్)

కోవెలకుంట్ల, జూలై 27: కోవెలకుంట్లకు చెందిన ఓ యువకుడు ముంబైలో ప్రమాదవశాత్తు రైలులో నుంచి కింద పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన వాసగిరి రామసుబ్బయ్య, భ్రమరాంబ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. వీరిలో పెద్ద కుమారుడు వీఎస్ రజనీకాంత్ అనే యువకుడు మద్రాసులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సెకండియర్ చదువుతుండగా ముంబైలో క్యాంపస్ సెలక్షన్‌లో ఉద్యోగం సాధించాడు. నెల రోజుల క్రితం ఉద్యోగంలో చేరి విధులు నిర్వర్తిస్తుం డేవాడు. అందులో భాగంగానే ఈ నెల 25న ముంబైలో ఆఫీసు నుంచి సైట్‌కు వెళ్లేందుకు రైలు ఎక్కాడు. మంది ఎక్కువగా ఉండడంతో రైలు డోరు వద్దనే నిలబడ్డాడు. రైలు వెళ్తుండగా ప్రమా దవశాత్తు చేయి జారి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తండ్రి రామసుబ్బయ్య బంధువు లతో కలిసి అక్క డకి వెళ్లి రజనీకాంత్ మృత దేహాన్ని కోవెలకుంట్లకు తీసుకువచ్చాడు. శని వారం అంత్యక్రియలు నిర్వహించారు. చేతికం దిన కొడుకు చనిపోవడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు.

మద్దిలేటి స్వామిని దర్శించుకున్న టీడీపీ నాయకుడు



వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకుంటున్న ధర్మవరం గౌతమ్ రెడ్డి

బేతంచెర్ల, జూలై 27: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి, మహాలక్ష్మీ అమ్మవా రిని డోన్ టీడీపీ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో డోన్ పట్టణ టీడీపీ అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, జిల్లా టీడీపీ రైతు కమిటీ కార్యదర్శి జలదుర్గం విష్ణు పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు: సీఐ

డోన్(రూరల్), జూలై 27: పట్టణంలో అల్లరి మూకలు ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని వినాయకుని గుడి ప్రధాన రోడ్డు ప్రాంతంలో పట్టపగలే కొందరు విద్యార్థులు ఘర్షణలకు దిగడం కలకలం రేపింది. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పట్టణ పోలీసులు స్పందించారు. ఘర్షణకు పాల్పడిన విద్యార్థులను, తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. రాత్రి పూట పట్టణంలో ప్రధాన కూడళ్లలో పో లీసులు గస్తీ పెంచారు.

కత్తెర పురుగును నివారించండి

సంజామల, జూలై 27: మొక్కజొన్నకు సోకిన కత్తెర పురుగును నివారించాలని వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి కోరారు. శనివారం ఆల్వకొండలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు. రెడ్డిపల్లె, ఆల్వకొండ, ఆకుమళ్ల గ్రామాల్లో సాగైన మినుము పంటను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలకు సోకే చీడా, పీడలపట్ల రైతులకు అవగాహన కల్పించారు.

మొక్కల ప్రాధాన్యంపై అవగాహన

డోన్(రూరల్), జూలై 27: పట్టణంలోని పాతపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మొక్కల ప్రాధా న్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి ఉపాధ్యాయులు పాఠశాల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు.

పండ్ల తోటల సాగుకు వంద శాతం సబ్సిడీ



మాట్లాడుతున్న హార్టికల్చర్ అధికారి ధరణి

ఉయ్యాలవాడ, జూలై 27: చిన్న సన్నకారు రైతుల పండ్ల తోటల సాగుకు వంద శాతం సబ్సిడీ అందిస్తున్నామని హార్టికల్చర్ అధికారి ధరణి తెలిపారు. శనివారం నర్సుపల్లె, పడిగపాడు. పెద్దయమ్మనూరు గ్రామాల్లో రైతులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా మామిడి, చీనీ, నిమ్మ, సపోటా, నేరేడు, జామ, తైవాన్ జామ, అంజీరా, మునగా, మల్లెపూలు, డ్రాగన్‌ఫ్రూట్ తదితర పంటల సాగుకు రైతులకు వంద శాతం సబ్సిడీ ఇస్తామని తెలిపారు. ఉపాధి ఏపీవో రవిప్రకాశ్, ఈసీ షరీఫ్, పీఏ ఓబులేరెడ్డి పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



వేంకటేశ్వర స్వామికి కుంకుమార్చన చేస్తున్న భక్తులు

రుద్రవరం, జూలై 27: మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి లక్ష్మీగోదాదేవి అమ్మవారికి, మానస లింగేశ్వరస్వామి త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు వారణాసి గోపిశర్మ, శివశర్మ పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నరసింహ స్వామి ఆలయాల్లో.. నరసాపురం, రుద్రవరంలోని దొర్వి, గుట్ట నరసింహస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించం

ప్యాపిలి, జూలై 27: ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించమని ఎంపీపీ గోకుల్ లక్ష్మి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్ గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. కాబట్టి అధికారులు పారిశుధ్యం పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. వాటర్ ట్యాంకులను కూడ నిబంధనల ప్రకారం శుభ్రం చేసి ప్రజలకు మంచినీరును సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ దిలీప్‌చక్రవర్తి, ఎంపీటీసీ మెంబర్లు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దారుగా రవీంద్రప్రసాద్

రుద్రవరం, జూలై 27: రుద్రవరం ఇన్‌చార్జి తహసీల్దారుగా రవీంద్ర ప్రసాద్‌ను నియమిస్తూ కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దారుగా రవీంద్రప్రసాద్ శనివారం విధులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దారు మురళీమోహన్ చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లారని తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో-2

డోన్(రూరల్), జూలై 27: డోన్ పట్టణం పాతపేట జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గణితంలో 100/100 మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఎంఈవో-2 నర్సప్ప చేతుల మీదుగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.